



# రిలీఫ్

- వారణాసి రామకృష్ణ

"శివా!"

"ఫ్యాక్టరీకెళ్ళాలని బట్టలు వేసుకుంటున్న శివరాంని తల్లి పిలిచింది. ప్యాంటు సర్దుకుంటూ తల్లి మంచం ప్రక్కకి చేరాడు.

"బి.పి. మళ్ళీ కాస్త ఎక్కువయినట్టుందిరా! సాయంత్రం వచ్చేప్పుడు బెటాకార్డ్ తెస్తావా?" తల్లి ప్రశ్నకి తేలికగా వున్న జేబుని తలుచుకుని బరువుగా నిట్టూర్చాడు.

"డబ్బులున్నాయా శివా" తల్లి మళ్ళీ రెట్టించేసరికి

"ఎలాగోలా సర్దుబాటుచేసి తెస్తానుగా" పొడిగా అనేసి సగం తెగిన చెప్పుల్ని సరిచేసుకుని సైకిలెక్కి బయలుదేరాడు.

శివరాం పనిచేసే ఫ్యాక్టరీ ఒక ప్రభుత్వరంగ సంస్థ. రెండు పదుల వయస్సులో తండ్రి హఠాత్తుగా పోవడంతో ఉద్యోగంలో చేరాల్సి వచ్చింది. మొదటి నుంచీ కష్టపడే మనస్తత్వం అవడం వల్ల శివరాం అతి త్వరలోనే జీవితంలో కుదురుకున్నాడు. ఫ్యాక్టరీకి కాస్త దూరంలోనే చిన్నస్థలం కొని ప్రైవేటు సంస్థలిచ్చే ఋణంతో ఇల్లు కూడా కట్టేడు. ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు పుట్టాక పిల్లలు పుట్టకుండా ఫుల్‌స్టాప్ కూడా పెట్టేశాడు. అన్నీ సవ్యంగా గడిచిన రోజులవి. ప్రభుత్వ ఉద్యోగం, నెల తిరిగేసరికి జీతం. మూడు నాలుగు నెలలకోమాటు డివిజనల్ ఇన్‌సెంటివ్‌లు, సంవత్సరానికోసారి కార్పొరేటు ఇన్‌సెంటివ్. దీనికి తోడు బోనసు. ఇక ప్రతి నెలా కన్వేయన్సు, హోటీలు, క్యాంటెన్ సబ్సిడీలు, వార్షికోత్సవ సందర్భంగా సంస్థ ప్రతి ఏటా వాచీలు, స్టీలు క్యారియర్లు, డిన్నర్ సెట్లు – వగైరాల బహుమతులు. శివరాం కుటుంబం ఒకప్పుడు అనుభవించిన దరిద్రం గురించి తెలిసినవాళ్ళు అతనికి పట్టిన అదృష్టాన్ని చూసి ఈర్ష్యపడ్డారు. ఎంతలో ఎంత బాగా కుదుటపడ్డాడా అని కొందరు ఆశ్చర్యపోయారు. కానీ కాలం విచిత్రమైనది. పరిస్థితులు మహా దారుణమయినవి. సవ్యంగా నడిచే నావకి ఒక చిన్న చిల్లు ఎంతటి విపత్తును కలిగిస్తుందో సమర్థంగా నడిచే సంస్థల్ని అవినీతి జబ్బు పట్టిపీడిస్తే ఎలా పతనం ప్రారంభమవుతుందో శివరాంకి బాగా అర్థమైంది. ఈ పతనం సరిగ్గా పదేళ్ళ క్రిందట ప్రారంభమయింది. ఒకప్పుడు స్కూటరెక్కి హుషారుగా ఆఫీసుకి వెళ్ళేవాడు. ఇప్పుడు సైకిల్ మీద వెళ్ళాల్సి వస్తోంది. పైగా వయసు మీరుతోంది. బాధ్యతల మూలాన, అకస్మాత్తుగా వచ్చిపడ్డ బరువుల వల్లా మనిషి మరింత కృంగిపోయి తొక్కలేక తొక్కుతూ అవస్థపడుతున్నాడు. శివరాం ఫ్యాక్టరీ ఆవరణ సమీపించేసరికి అక్కడ గేట్ మీటింగ్ జరుగుతోంది. యూనియన్ లీడర్ ప్రసాదరెడ్డి ఆవేశంతో ఊగిపోతూ ప్రసంగిస్తున్నాడు. "... ఈ విధంగా మనల్ని నిద్రబుచ్చుతూ కార్మిక వ్యతిరేక చర్యల్ని మేనేజిమెంటు ప్రోత్సహిస్తోంది. కార్మిక సోదరులారా! గత ఏడేళ్లుగా జరగాల్సిన వేతన సవరణ జరగనే లేదన్న సంగతి మనకందరికీ తెలుసును. పైగా ఇదిగో ఇస్తాం, అదుగ్గో ఇస్తాం అంటూ కనీసం ఇంటీరియమ్ రిలీఫ్‌ని కూడా ఇవ్వకుండా నాటకాలు ఆడుతున్నారు.

పనికిమాలిన కార్మిక వ్యతిరేక మేనేజిమెంటునీ, ప్రభుత్వ విధానాలను మనం తీవ్రంగా నిరసించాలని చెప్పే మీ కందరికీ విజ్ఞప్తి..." మైక్‌లోంచి అతను అరుస్తుంటే చుట్టూ చేరిన భజన బృందం హర్షం వ్యక్తంచేస్తోంది. శివరాం అక్కడ నిలబడలేక దూరంగా చెట్టు కిందికి చేరాడు. ప్రస్తుతం అతని పరిస్థితి అటూ ఇటూ కాకుండా వుంది. ఉద్యోగంలో చేరడం కార్మికుడిగానే చేరినా ప్రతిభను చూపి త్వరలోనే ఫోర్‌మెన్ దాకా ఎదిగాడు. సరిగ్గా అప్పట్నించే పరిస్థితులు మారిపోయాయి. ఫ్యాక్టరీ కోసం అహర్నిశలు శ్రమించి పనిచేసే ఎం.డి. రిటైర్ అయ్యాడు. అతని స్థానంలోకి రణసింగ్‌దేవ్ కొత్తగా వచ్చాడు. అతని అవినీతి చరిత్ర, కుంభకోణాల భాగోతం అంతకు ముందే పస్నెకెక్కినవి. ఒక ప్రభుత్వరంగ సంస్థ పూర్తిగా భ్రష్టుపట్టాక అతన్ని ఇక్కడికి వేశారు. ఉన్నత స్థాయి రాజకీయాల్లో అతనికున్న పలుకుబడి దీన్ని బట్టి అర్థంచేసుకోవచ్చు. రావడమే ఆలస్యం తన ప్రతాపాన్ని ప్రదర్శించాడు. ఫలితంగా ఫ్యాక్టరీ నష్టాల దారి పట్టింది. ప్రభుత్వరంగ సంస్థలు నష్టాల దారిలో తప్ప లాభాల బాటలో ప్రయాణించవన్న పెద్దల జోకులతో మరో నాలుగైదు ఏళ్ళు గడిచాయి. కేంద్రంలో ప్రభుత్వాలు మారాయి. విదేశీ విధానాలతోబాటు ఆర్థిక విధానాలూ మారాయి. నష్టం వచ్చే ఫ్యాక్టరీలు ఒక్కొక్కటిగా మూతపడడం మొదలైంది. కాస్తో కూస్తో ప్రయోజనకరమైనవని భావించే వాటినీ ప్రైవేటుపరం చేయడానికి రంగం సిద్ధమవుతోంది. పొదుగు నుంచి పాలు పిండుకున్నట్టు ఫ్యాక్టరీని పూర్తిగా దండుకుని అది వట్టిపోయిన ఆవు అన్న సంగతి వెలుడేలోగానే రణసింగ్‌దేవ రిటైర్ అయి శేషజీవితాన్ని హాయిగా బంగళాలలో గడుపుతున్నాడు. ఎటొచ్చి ఇరుక్కుపోయింది ప్రస్తుత ఉద్యోగ వర్గాలే! ఉద్యోగ వర్గాల్లోనూ అనేక రకాలున్నాయి. ఎమ్‌డి అంతటివాడు తినగా లేంది మనమేం తక్కువన్నట్టు ఎవరి స్థాయిల్లో వాళ్ళు లంచాలు మరిగారు. కొందరికి ఆ అవకాశం లేక కసి పెంచుకుని పనిచెయ్యడం మానేసి సంతృప్తిపడసాగారు. ఎమ్‌డి అవినీతిని తూర్పారబడుతూ కార్మిక సానుభూతి ఓట్లతో నాయకులైన వాళ్ళు అధికారంలోకిరాగానే మాట్లాడడం మానేసి సొంత ఆస్తులు పెంచుకునే మార్గాలు వెతికారు. మరి కొందరు సింగ్‌దేవ్ అధికార ఛత్రం క్రిందికి చేరిపోయి ఫ్యాక్టరీ రాకుండానే మేనేజ్ చేస్తూ బయట వ్యాపారాలు పెట్టి బాగుపడ్డారు. నిరంతరం ఫ్యాక్టరీకి అంకితమయిన శివరాం లాంటి వాళ్ళు మాత్రమే ఎటూ కాకుండా మిగిలారు. వీళ్ళకి ప్రమోషన్లు దొరికి పై స్థాయి అధికారులు అవరు. అలాగని భుజబలం ప్రదర్శించో, నోరు పెట్టుకుని అరిచో ఏదో ఒక ప్రయోజనాన్ని పొందే వర్గంలోకీ రారు. పైగా ఎప్పుడయితే ఫ్యాక్టరీ ఖాయిలా పడిందో అప్పట్నించి అన్ని సౌకర్యాలు ఒక్కొక్కటిగా నరుక్కుపోయాయి. సంస్థ బాగుపడాలంటే సౌకర్యాలను స్వచ్ఛందంగా మనం త్యాగం చేసి కార్మిక లోకానికి మార్గదర్శకం కావాలంటూ అధికార్ల సంఘ అధ్యక్షుడు ఓ రోజు హడావిడిగా ప్రకటించేశాడు. ఫలితంగా వున్న కొద్దిపాటి సౌకర్యాలనూ వదులుకోవాల్సి వచ్చింది. కార్మికులు మాత్రం తమకు సౌకర్యాలు వుండాల్సిందేనంటూ ధర్నాలు జరిపారు. ఫలితంగా సూపర్‌వైజర్లు, అధికార్లు సైకిళ్ళెక్కి ఫ్యాక్టరీకి వస్తుంటె కార్మికులు మాత్రం స్కూటర్ల మీదే వస్తున్నారు. బోనసు ఇన్సెంటివ్‌ల సీలింగు తాతలకాలంనాటివే కావడంతో శివరాంకి అవి కూడా వచ్చే అవకాశం లేదు. గేట్ మీటింగ్ ముగిసి ఉద్యోగులంతా ఫ్యాక్టరీలోకెళ్తుండడం చూసి శివరాం మెల్లగా తానూ లోనికెళ్ళాడు. ఆ రోజు మధ్యాహ్నం హఠాత్తుగా ఓ వార్త ఉద్యోగ వర్గాలన్నింటిని ఆనందంలో ముంచెత్తింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం ఇంటీరియం రిలీఫ్ క్రింద అందరికీ డబ్బును మరో వారం రోజుల్లో చెల్లించబోతున్నారన్నది వార్త సారాంశం. ఎక్కడ చూసినా ఉద్యోగులు గుంపులుగా చేరి దీని గురించే చర్చించుకున్నారు. శివరాం మనసులో ఎన్నో ఖర్చులు తేలాయి. మొదట పిల్లలకి, తనకు బట్టలు, తర్వాత చెప్పులు. మళ్ళీ ఆ నెలలోనే పెద్దాడికి ఫీజు కింద రెండు వేలు పంపాలన్న విషయం జ్ఞాపకం వచ్చింది. మీ అమ్మగారికో మాటు స్కానింగ్ చేయించడం ఎందుకయినా మంచిదని అప్పుడెప్పుడో డాక్టరు చెప్పిన విషయమూ గుర్తొచ్చింది. ఆలోచనలతో సతమతమవుతూ సాయంత్రం ఇంటికెళ్లాడు. గుమ్మంలోనే భార్య సరస్వతి ఎదురయి,

"మీకు ఇంటీరం రిలీఫ్ ఇస్తున్నారటగా" అంటూ భర్తతో కూడా లోనికొచ్చింది.


"అప్పుడే నీదాకా వచ్చిందీ..." వ్యంగ్యంగా అన్నా అందులో విసుగూ ధ్వనించింది.

"పక్కింటి శ్రీహరిగారి భార్య చెప్పిందిలెండి! ఇవాళ ఆయన రెండు గంటలు పర్మిషన్ తీసుకుని పెందరాళే వచ్చేశాడు... " వార్త ఎలా చేరిందో సరస్వతి వివరించి,

"ఏమండీ, మీ కేడర్ వాళ్ళకి పది వేల దాకా వస్తుందటగా! శ్రీహరి భార్య లెక్కేసి చెప్పింది..." ఆమె అడుగుతున్న తీరుకి శివరాంకి నవ్వొచ్చి,

"ఎంతయినా మన అవసరాలకి సరిపోనంతేలే..." అన్నాడు.

"ఎలాగైనా మీరు మాత్రం ఈసారి నా రవ్వల దుద్దులు బాగుచేయించాల్సిందే!" గోముగా అనేసి "పిల్లకి పెళ్ళీడు వస్తోంది. దానికి జత గాజులు, మెళ్ళో చెయినయినా లేకపోతే ఏం బాపుంటుంది చెప్పండి" అంటూ మరో ప్రపోజల్‌కి శ్రీకారం చుట్టింది. ఇంతలో చిన్నకొడుకు మిస్సైల్‌లా దూసుకొచ్చి, "డాడ్! మా కాలేజీలో అందరం బెంగుళూరు, ఊటి టూర్ కెళ్తున్నాం. నాకో రెండు వేలు కావాలి!" హుకుం జారీచేశాడు. మంచం మీంచి తల్లి లేచొచ్చి, "ఏరా శివా! ఎటూ పోయే ప్రాణమే నాది. మందుల ఖర్చెందుకు దండగ కానీ ఒక్కసారి కాశీ చూసొస్తానురా! ఇందాక శ్రీహరి భార్య చెప్పింది – నీకేదో ఆఫీసు డబ్బొస్తోందటగా – కాస్త సర్దుబాటుచేసి నన్ను కాశీకి పంపరా –" ఆమె మాట పూర్తికాకుండానే ఇంటి ముందు గోల వినిపించి శివరాం బయటికొచ్చి చూశాడు. అందరూ తన సంస్థ ఉద్యోగులే. గుంపుగా చేరారు. ఒకతను చెవి దగ్గరగా ట్రాన్సిస్టర్ పెట్టుకుని వార్తలు వింటున్నాడు. శివరాం వెళ్ళి వాళ్లలో కలిశాడు. మాజీ నాయకుడొకడు శివరాంని చూసి పలకరింపుగా నవ్వి, "టైమ్ బాలేదు గురూ! గవర్మెంటు ఇంటీరిం రిలీఫ్ గురించిన మీటింగ్‌ని మూడు నెల్లపాటు పోస్ట్‌పోన్ చేసిందట! " చెప్పాడు. వినగానే శివరాం నిర్ఘాంతపోయాడు. అంతకు ముందున్న ఆనందం కాస్తా పటాపంచలయింది. ఇంతలోనే వార్తలు వింటున్న వ్యక్తి, "బి.ఐ.ఎఫ్.ఆర్.కి రెఫర్ చేసిన కంపెనీ లిస్ట్‌లో మన ఫ్యాక్టరీ పేరు కూడా వుంది!" గట్టిగా కేకలు వేశాడు. భూకంపానికి గురయినట్టు అందరూ భయభ్రాంతులైనారు. ఆశ్చర్యంతో కొయ్యబారిపోయారు. శివరామే ముందుగా కాస్త తేరుకుని నిర్లిప్తంగా నవ్వేడు ఏ మందులకూ లొంగని వ్యాధికి గురయి మృత్యుశయ్య మీదున్న సంస్థకి కర్మకాండ జరపాల్సిన సమయం వచ్చిందన్న విషయం అందరికీ అర్థమైంది. జరుగబోయే తద్దినాల తంతు తల్చుకోగానే శివరాంకి నవ్వొచ్చింది. చాలా సంవత్సరాల తర్వాత చాలా రిలీఫ్‌గా మనస్ఫూర్తిగా గట్టిగా పైకి నవ్వేడు. తక్కిన ఉద్యోగులంతా వింతగా, భయంగా శివరాంని చూశారు. ◆




23-9-04